# కథా ప్రయోగం

నేను నెల్లూరులో పని ముగించుకొని సాయంత్రం అయిదు గంటల ఎక్స్‌ప్రెస్‌కు ఎక్కుదామని వచ్చాను. కౌంటర్‌వద్ద టిక్కెట్లడిగాను.

'ఎక్కడికి?'

'విజయవాడ, ఎక్స్‌ప్రెస్‌కు '

'ఎక్స్‌ప్రెస్ కదలబోతూంది. పోండి త్వరగా.'

ఆదరా బాదరా టిక్కెట్టూ, చిల్లరపైసలూ జేబులో కుక్కుకొని పరిగెత్తుకుంటూ రైలెక్కాను.

నిజమే! అప్పటికే గార్డ్ విజిల్ ఇచ్చాడు.

నేను ఎక్కడం, బండి కదలడం రెండూ ఒకేమాటు జరిగాయి. ఈ హడావుడీ గుండెదడా తగ్గి కొంచెం పెట్టెవైపు తేరిపార చూడటానికి ఓ అయిదు నిమిషాలు పట్టింది. పెన్నాబ్రిడ్జి, పడుగుపాడు, దాటిపోయాయి. మెల్లగా గేటునుండి కదిలి సీటుకోసం చూచాను. అదృష్టవశాత్తూ పెట్టె అట్టే రష్‌గా లేదు. వెళ్ళి ఓ సీట్లో కూర్చున్నాను ఆదేసీట్లో ఒకాయన కిటికీవైపుగా కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఓపాటి వయస్సులోనే ఉన్నాడు. పరిశీలించి చూచాను. ఆయన శేఖరం వ్రాసిన 'పల్లెపిల్ల'అన్న నవల చదువుతున్నాడు. చదువుకొని తనలో తాను ఆనందిస్తున్నాడు. ఆయన వెనక ఆరోజు దినపత్రిక ఉంది. పనుల గొడవలో నేనసలు నెల్లూరులో పేపరుకూడా చూడలేదింతవరకూ.

'ఆ పేపరు కొంచెమిస్తారా?'

ఆయన ఒక్కసారి నావైపు చూచి, ఒక్కసారి మళ్ళీ ఎగాదిగా చూచి చటుక్కున పేపరు నావైపు నెట్టి మళ్ళీ పుస్తకంలో పడ్డాడు. నేను పేపరు తీసు

కొని హెడ్డింగులు చూడటం మొదలుపెట్టాను కాసేపట్లో ఆ పని అయి పోయింది. లీడర్ చదివాను. ప్రకటనలూ అవీ చూచాను. పేపరు మడిచి, 'అయ్యా ఇదిగో మీ పేపరు' అని మర్యాదగా ఆయన చేతికి ఇచ్చాను.

ఆయన మళ్ళీ నావైపొకసారి ఎగాదిగా చూచి రెప్పలాడించి చటుక్కున పేపరు తీసుకొని మళ్ళీ పుస్తకంలో మునిగిపోయాడు. నాకాయన ప్రవర్తన విచిత్రమనిపించింది. ఎదురు బల్లమీద ఎవరూ లేరు ఆయనేమో పుస్తకం చదువు తున్నాడాయెను ఎలా ఉబుసుపోతుంది? కిటికీగుండా కాసేపు ప్రకృతిని చూచి ఆనందించాను. రైలు శరవేగంతో దూసుకుపోవడంవల్ల దూరంగా వచ్చని పొలాలూ, పల్లెలూ, గొర్రెలకాపర్లూ మందలూ, చిన్న చిన్న సెలయేళ్ళూ ఒక దాని తరవాత ఒకటి దూసుకుంటూ వెనకకు వెనకకు పోతూ చాలా మనోజ్ఞంగా కనిపించింది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఆయన అన్నాడు:

'ఈ నవల వ్రాసినాయనకు బొత్తిగా బుద్ధిలేదండి!'

నాకు ఆశ్చర్యం వేసింది. ఒకటి- ఆయన మాట్లాడినందుకు; రెండు- పర దూషణ చేస్తున్నందుకు. శేఖరం వ్రాసిన 'పల్లెపిల్ల' చాలా మంచి నవల అనే ప్రసిద్ధి ఉంది నేనుకూడా చదివానెప్పుడో ఓసారి.

'మీ రెందుకలా అంటున్నారు?' నేను సూటిగానే ప్రశ్నించాను.

'ఎందుకంటే ఈ నవల నాకు నచ్చలేదు కనక. చూడండి, మీ పేరే మన్నారు?'

'రామమూర్తి' నా పేరు చెప్పాను.

'రామమూర్తిగారూ, నవలాకారుడికి ప్రకృతి పరిశీలన చాలా ముఖ్యం. ఇదుగో, మీరా కిటికీగుండా ప్రకృతిని చూచి ఆనందిస్తున్నారు చూడండి- అలా ప్రకృతినీ, మానవ ప్రకృతినీ చూచి, పరిశీలించి ఆనందించాలి. పరవశించాలి. అప్పుడు కాని అతడు చక్కని కావ్యాన్ని నిర్మించలేడు. ఈ 'పల్లెపిల్ల' నవల చూడండి. దీనికో తలాలేదు, తోకాలేదు ... ఏమంటారు?'

నేను కొంచెం ఉక్రోషపడిపోయినా, నిగ్రహించుకున్నాను. మానవుడికి సహజంగా ఈ బలహీనత ఉంటుంది.

ప్రసిద్ధులైన వ్యక్తుల నెవరినైనా విమర్శిస్తూ తిడుతూ, ఆ తిట్టడంద్వారా తామూ అంతస్తును అధిగమించలేకపోయామన్న మానసిక వ్యథను కప్పిపుచ్చుకోవడం. ఆ మాటే అందామనుకున్నాను కాని, కొత్త మనిషితో కాసేపు రైలు ప్రయాణంలో వృథాగా దెబ్బలాటెందుకని ఊరుకున్నాను.

'అయ్యా, తమ పేరేమిటన్నారు?'

'వెంకటేశ్వర్లు ఏం. ఎందుకు?' ఆయన ప్రశ్న.

'చూడండి, వెంకటేశ్వర్లుగారూ, మరేమనుకోకండి. నేనూ ఈ 'పల్లెపిల్ల' నవల చదివాను. నాకు బాగా నచ్చింది. నాకేకాదు, చాలామంది తెలుగువాళ్ళకు నచ్చింది.'

దానితో ఆయనకు కోపం వచ్చింది. కొంచెం స్వల్ప కోపిలాగున్నాడు. ఛక్కున నోరు జారాడు.

"ఆఁ ఈ రామమూర్తులు రంగప్పలు పొగడాల్సిందే శేఖరాన్ని. ఇదేమిటండీ, ఓ పుస్తకం బాగా లేదంటే ఈ తెలుగుదేశంలో తప్పా? దానమ్మ కడుపు బంగారంకానూ చెదలపుట్టలా పుట్టుకొస్తున్నాయి నవలలు. నిన్నటి నవల నేడు లేదు. నేటి రచయిత రేపటికి పేరులేకుండా పోతున్నాడు ఇదేం బాగాలేదు బొత్తిగా. ఈ శేఖరం మటుకు శేఖరాన్ని తీసుకోండి. వాడి బతుకు నాకు తెలుసు. ఒట్టి పనికిమాలినవాడు. చిన్నప్పుడు మా ఊళ్ళో గోలీకాయలాడుకుంటూ మా కళ్ళ ఎదుట కోర్టు వీథితో తిరిగిన కుంక ..."

"మీదేఊరు?" నేను ప్రశ్నించాను కుతూహలంతో.

"ఆఁ అదే- మొన్ననే జిల్లా చేశారే, ఆ ఊరు."

ఒంగోలు కాబోలు ఈయనది.

"అక్కడ హార్డింజి స్ట్రీటూ, హాస్పిటల్ స్ట్రీటూ నిద్రలేచిన దగ్గరినుంచీ సర్వే చేయడమే వీడి పని. మేమంతా చిన్నప్పుడు చెప్పాము- శేఖరం, కాస్త కుదురుగా చదువుకోరా, రోడ్లూ రప్పలూ సర్వే చేయకురా, దానికి వేరే డబ్బుచ్చుకొని పనిచేసే డిపార్టుమెంట్ ఉందిరా బాబూ, అంటే విన్నాడూ?లేదు,

అటు చదువూ చదవక, ఇటు ఓ మంచి ఉద్యోగమూ అఘోరించక చివరకు అగమ్మకాకిలా అయిపోయాడు నాలుగురోజులు సింగరాయకొండలో లాటరీ, ఓ పూట కావలి కళుగోళమ్మ గుడిదగ్గర బిచాణా, ఓ పూట కరవది ప్లాట్ ఫారంపై బస, ఓరోజు తెనాలి బస్సుస్టాప్‌లో వవ్యాశింపుసేవ - ఇలా గడిచింది వీడి జీవితం...."

వెంకటేశ్వర్లుగారిమీద నాకు బాగా కోపం వచ్చింది. శత్రువునైనా క్షమించే భూమి మనది. పాముకు పాలూ, పంచదార పెడతామే! అలాంటిది తోటివాడూ, అందులోనూ తెలిసినవాడంటున్నాడు, అలాంటి ఉత్తమ జాతి రచయిత శేఖరం గూర్చి ఇంత కరుకుగా మాట్లాడుతాడాయన? బహుశా ఏ వ్యక్తిగత ద్వేషమో వీరిరువురికీ ఉంటుందనిపించింది.

"ఇదిగో, రామ్మూర్తిగారూ, వినండి .." నేనెక్కడ పరధ్యానంగా ఉన్నానోనని తన జాతి మాత్సర్యం చాటుకోవడానికి మళ్ళీ నన్ను హెచ్చరించి మరీ మొదలు పెట్టాడు.

"ఇంతటితో ముగియలేదు వీడి కథ. అలా అడూరూ అడూరూ పట్టుకొని తిరిగి చివరకు బెజవాడ చేరాడు. అక్కడ ఓ నాటకాల కంపెనీతో పరిచయమైంది. వాళ్ళు ఈయనకో వేషం ఇచ్చారు. ఫరవాలేదు, బాగానే సరిపోయింది. దానితో ఓ పూట తిని, ఓ పూట తినకా బతకడం మొదలెట్టాడు. ఇదిగో, నా చేతిలో ఉందే "నల్లపిల్ల" - ఈ నవల వీడు ఆ రోజుల్లో వ్రాసింది. నవలైతే వ్రాశాడు కాని విజ్ఞానమెక్కడిది చవటకు! అసలు, రామ్మూర్తిగారూ, ఈ 'పల్లెపిల్ల' అన్న పేరే తప్పు, పల్లె అంటే ఏమిటి? పల్లెటూరనా? కానీ, ఇందులో ఈయనొక బెస్తపల్లె వర్ణించాడే, మరి? ఈయనేం బెస్తపల్లెలో పుట్టి పెరిగాడా? అనుభవం లేకుండా ఏవో అభూతకల్పనలు చేయడమూ, అమాయికులైన పాఠకులను మోసగించడమూ, ఇదేం బాగాలేదు. రామ్మూర్తిగారూ ... సోమర్‌సెట్ మామూ, టాల్‌స్టాయీ, పెరల్‌బక్కూ ఇలాగే వ్రాశారా నవలలు? వాళ్ళ నవలలంటే ఏమిటి? ఒక్కొక్కటి ఒక్కో మహాకావ్యం. కాదంబరిలాంటి గద్య ప్రబంధాలన్నమాట. కాని, తెలుగుదేశంలో చూడండి. కుక్కగొడుగుల్లా పుడుతున్నారీ శేఖరం లాంటి రచయితలు. చదువూ - సంస్కారమూ, ఏ గుడ్డూ ఉండదు ఓ చెత్త నవల వ్రాయడం, అచ్చుకొట్టి కాగితాలు ఖరాబుచేయడం, తానే పది పేర్ల

పెట్టుకొని పది ఊళ్ళనుండి ఉత్తరాలు పోస్టుచేసో. చేయించో పొంగిపోవడం, "మీ నవల చాలా బాగుంది", "అందులో మరీ ఆ మాధురి పాత్ర చాలా నచ్చింది", 'కథ పోనూ పోనూ ఆకర్షణీయంగా ఉంది ... రాబోయే సంచికకై ఎదురుచూస్తున్నాము.' ఏమిటి, సార్, ఎదురుచూచేది వీళ్ళు? ... ఇదంతా నిజమేనంటారా? మాధురి పాత్రకు ఈ పాఠకులు ఎదురుచూస్తున్నారట. ఈ పాఠకులకు వేరే ఉద్యోగాలూ పాడూ లేనట్లూ, మాధురి పాత్రకోసం ఎదురుచూస్తూ కూర్చున్నట్లూ .. ఇట్లాగయితే జనం భిక్షాపాత్ర చేతబుచ్చుకొని బయలుదేరాలిక. ఎవరండీ ఈ శేఖరాన్ని ఆదరించే పాఠకుడు? చూపండి వాణ్ణి నాకు.'

నేనిక మాట్లాడదలుచుకోలేదు. మనిషి వ్యక్తిగత ద్వేషంతో మాంచి వేడిలో ఉన్నాడు. ఇప్పుడిక సాత్వికమైన ప్రసంగాలు రుచించవు.

"అయిందా, రామ్మూర్తిగారూ? వీడలా ఏవో ఓ రెండు మూడు పుస్తకాలు కాగితాలు ఖరాబుచేసి అచ్చు వేయించుకున్నాడా - ఇంతలోనే ప్రారంభమైంది రసవత్తర నాటకం. వీడి నాటవాల కంపెనీలో ఓ పిల్ల ఉంది. దాని పేరూ ఊరూ, కులమూ, గోత్రమూ ఏమీ తెలియవు సార్ మనకు. దాని వల్లో పడ్డాడు వీడు, ఇంకేం! వీడసలే టక్కు సన్యాసి. ఆవిడ వాణ్ణింకా పిల్చి పిప్పి చేసింది. నాలుగు రోజుల్లో కాశేశ్వరరావు మార్కెట్‌లో పీల్చి పారేసిన మామిడి పండు డొక్కులాగా తయారైనాడు. ఆ అవతారంతో మళ్ళీ మా ముందు ఒంగోలు కోర్టు వీధిలో ప్రత్యక్షం. అప్పుడు నేను చిలకకు చెప్పినట్లు చెప్పాను- "శేఖరం, జరిగినదాని కేమీ దిగులుపడకు. గతం మరిచిపో. ఇదుగో, మా పలుకుబడి ఉపయోగించి ఈ కోర్టులో ఓ గుమాస్తా పని ఇప్పిస్తాము. బిళ్ళ బంట్రోతుగానన్నా పనిచేసి గౌరవంగా బతుకు. లేదా గౌరవనీయులైన పెద్దలకు చెప్పి ఓ వదో పరకో అప్పు ఇప్పించే ఏర్పాటుచేస్తాను. సంతపేటలోనో, గద్దలగుంటలోనో ఓ బీడీదుకాణం పెట్టుకొని కాలక్షేపంచెయ్యి"అని. అహఁ వింటేనా? అయినా నా పిచ్చిగాని శని నెత్తిమీద తాండవమాడుతుంటే ఎలా వింటాడు, రామ్మూర్తిగారూ? 'బుద్ధిః కర్మానుసారిణీ' అన్నారు పెద్దలు. "రేయ్ వెంకటేశ్వర్లూ! నీది జానాబెత్తెడు జీవితం. నేనో? ఈ విశాల ప్రపంచానికి వారసుణ్ణి. ఇలా కిల్లీకొట్లలోనూ, కోర్టు గుమ్మాలలోనూ కట్టుబడి ఉండను" అన్నాడు పెద్ద సినిమా హీరోలా పోజుపెట్టి ఏమి మాటలు సార్ అవి, రామ్మూర్తిగారూ?

నీదేమన్నా కలక్టరా, గవర్నరా? పోనీ, జగద్గురువా. గౌతమబుద్ధుడా? పీడా కిల్లీ కొట్టులో బంధింపబడడట; జగత్తుకు వారసుడట. ఏం పిచ్చి కబుర్లివీ! నేనంటే ఊరుకున్నానుకానీ ఇంకోడైతే లాగించి మూతి పళ్లు రాలదన్నేవాడు."

కథ రసవత్తరంగా ఉంది. కావలి స్టేషను రావడమూ పోవడమూ కూడా తెలియలేదు మాకు. ఉలవపాడు దాటిపోయింది.

"ఆ తరవాత?" అన్నాను నేను.

"వినండి, చెపుతాను. ఇంకోడైతే రెండు లెంపకాయ లిచ్చుకొనేవాడు కాని నేనుమాత్రం గౌరవంగా మణి హోటల్‌కు తీసుకువెళ్ళి ఓ ప్లేటు ఇడ్లీ, ఓ కప్పు కాఫీ ఇప్పించి "శేఖరం, ఇంతకంటే నిన్నిక ఎవ్వడూ ఆదుకోలేడు" పొమ్మన్నాను. "అలాగే పోతాను లేవోయ్!నా దృష్టి మొత్తం ఇప్పుడు మద్రాసు మీద ఉంది. సరేలే, ఓ సిగరెట్ పాకెట్‌కూడా కొని పారేయించు నా ముఖాన. ఎలాగూ టిఫిను పెట్టించావైతివి" అన్నాడు. సరేనని ఓ నిండు సిగరెట్ పాకెట్ కొని జేబులోపెట్టి మరీ పంపించాను. అంతేసార్. ఆ తరువాత వాణ్ణి చూడలేదు-కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు వెంకటేశ్వర్లు నాకు విచారం వేసింది. "వెంకటేశ్వర్లు గారూ, తరువాత ఏమయింది? ఆ శేఖరంగారు మద్రాసు చేరారా, లేదా?"

ఆదుర్దాగా ప్రశ్నించాను.

ఆయన ఒక్క క్షణం ఆగి చెప్పారు: 'ఆఁ చేరాడు. అక్కడ రాజా పానగల్ పార్క్ సమీపంలో మకాం పెట్టాడట ... అంతలావు మహానగరంలో ఈ కేరాఫ్ ప్లాట్‌ఫారంగాణ్ణి ఎవరు చూస్తారు సార్, రామ్మూర్తిగారూ .. తినేందుకు తిండిలేదు. తాగేందుకు కార్పొరేషన్ టాప్‌వాటర్. అలా నాలుగు రోజులయ్యేసరికి కళ్ళుతిరిగి రోడ్డుమీద వెల్లకిలా పడిపోయాడు. శరవేగంతో దూసుకు వస్తున్నది కారు. సడన్ బ్రేక్. అయితేనేం! తలమీద బలమైన గాయం. అదృష్ట వశాత్తో, దురదృష్టవశాత్తో ఆ కారులో ఓ ధనవంతురాలు ఉన్నది. ఆమె వాణ్ణి తన ఇంటిలోనే ఉంచుకొని కేసు బయటికి రాకుండా చికిత్స చేయించింది. గాయమైతే నయమైంది కాని మనిషికి మతి స్థిమితం మాత్రం తప్పింది. అసలే బలహీనుడాయె దానికి తోడు విజయవాడలో మామిడిపండు టెంకెలా మారి మాసిపోయె ఇక మనిషిలో బలమెక్కడ ఏడ్చింది? కాని, అదేం చిత్రమో,

ఆయమ్మకు వీడిలో ఏం ఆకర్షణ కనిపించిందో వీడికి సమస్తోపచారాలు చేయించి మనిషిని చేసింది. ఎక్కడికీ వెళ్ళవద్దు, తనదగ్గరే ఉండమన్నది. వాడూ సరే నన్నాడు. ఆ మతి స్తిమితం ఉండీలేని దశలోనే మరో నాలుగు పుస్తకాలు వ్రాశాడు. వెనక ధనసహాయం ఉండేసరికి అవి చూస్తూండగానే అచ్చై వచ్చాయి. శేఖరం మహారచయిత అయిపోయాడు.' వెంకటేశ్వర్లుగారు ఒక్క నిట్టూర్పు విడిచి గుక్క తిప్పుకున్నారు. బండి సింగరాయకొండ చేరింది. నేనలా స్థాణువునై వింటున్నాను. శేఖరం రచనలైతే చదివానేకాని అతని నవలల వెనక ఇంత జీవితమూ, వ్యవహారమూ ఉందని నాకేం తెలుసు? ఈ వెంకటేశ్వర్లు గారుకూడా మంచి కథకుడులా హుషారుగా, ఉక్రోషంతో, టెంపో సస్పెన్సులతో చెప్పుకుపోతున్నాడు కథ. బండి సింగరాయకొండ దాటింది. వెంకటేశ్వర్లుగారు మొదలుపెట్టారు.

'చూశారా? ఇలా ఉండగా ఓ విచిత్రం జరిగింది. ఆ ధనవంతురాలు గర్భవతి అయింది. సమాజంతో ఆవిడ అవమానం పాలయ్యే స్థితి వచ్చింది. భర్తలేదు. పేరుప్రతిష్ఠలు ఉన్నాయి. ఏంచేయాలి? అప్పుడు నిలదీసి అడిగింది- 'శేఖరం, నీవు నా భర్తవని లోకంకోసం అంగీకరించు' అని. చస్తే ఒప్పుకో నన్నాడు శేఖరం. "నీవేదో కళాహృదయం కల వ్యక్తివనుకున్నాను కాని నీ స్వార్థంకోసం నన్ను చదరంగంలో పావులా వాడుకుంటావని తెలిస్తే పొరపాటునకూడా నీ కారుకింద పడేవాణ్ణికాను. చాలు చాలు నీ సహాయానికి. పోతా" నన్నాడు. ఆమెకుకూడా పంతం వచ్చింది. కాపాడి ఇంత చేసినందుకు, బొత్తిగా కృతజ్ఞతకూడా చూపనందుకు ఆమె తాచుపాములా పగబట్టింది. "సరే, పో ఎక్కడికి పోతావో చూస్తాను. తిరిగి జీవితంలో గత్యంతరం లేని స్థితిలో నా కాళ్ళదగ్గరకు వచ్చి పడే రోజు రాకపోదు" అని ప్రతిజ్ఞ పట్టింది. "హుఁ ప్లాట్ ఫారమ్‌పైనన్నా పడి చస్తానుగాని తిరిగి మద్రాసు రా"నన్నాడు వాడు. అంతే అయింది...." వెంకటేశ్వర్లుగారు కళ్ళవెంట నీళ్ళు పెట్టుకున్నారు.

"సార్, ఏమిటిది?" నేను అడిగాను అదుర్దాగా. శేఖరమంటే ద్వేషమనుకున్నాను కాని ఈయనకింత ప్రేమ అతనిమీద ఉందని ఇప్పుడే తెలిసింది.

"ఏమీలేదు, రామ్మూర్తీ కంట్లో రైలుబొగ్గు పడింది' అంతే. సరే, శేఖరం మద్రాసు వదిలి ఇంటి ముఖం పట్టాడు కాని ఆమె మాత్రం వాణ్ణి వదిలి పెట్టలేదు. వాడి వెంట రౌడీలను పంపింది. ఇదిగో చూడు, ఆ రాబోయే ప్లాట్ ఫారమ్ ! అక్కడే వాళ్ళూ పీడూ నవారు ఆట ఆడారు"

ఒంగోలు స్టేషన్ లైట్లు చూపుతూ అన్నాడు.

"ఆఁ అప్పుడేమయింది ?"

వెంకటేశ్వర్లుగారు మరి మాట్లాడలేదు.

"సార్, సార్, తరువాత శేఖరం ఏమయినాడు ?" వెంకటేశ్వర్లుగారు సామానులు సర్దుకుంటున్నారు దిగడానికి. నేను గట్టిగా ఆయన రెండు భుజాలూ పట్టుకొని ఊపివేశాను ఆవేశంతో, "వెంకటేశ్వర్లుగారూ, శేఖరం ఆటలో గెలిచాడా, ఓడిపోయాడా ? చెప్పండి. అతని బతుకు చివరికేమైందో చెబితేకాని మీరు రైలు దిగడానికి వీలులేదు."

నా రసాత్మకమైన ఉద్రేకానికి వెంకటేశ్వర్లుగారు తెల్లబోయారు. ఒక్క క్షణం అలాగే ఉండి తరువాత తెప్పరిల్లి "అయితే శేఖరం జీవితం నిన్ను ఇంతగా ఆకర్షించిదా, రామ్మూర్తీ" అన్నారు చిరునవ్వు నవ్వుతూ. పెట్టెలోనుండి దూసుకొని ఒంగోలు పొడవైన ప్లాట్ఫారమ్ సమీపిస్తూంది రైలు. ఇతరుల బాధలో ఈయన చిరునవ్వు నవ్వుతున్నాడు. ఏమి ప్రవృత్తో అర్థం కాలేదు. నేను బిక్కముఖం వేసుకొని ఆయనకేసి చూస్తున్నాను. ఆయన జేబులోంచి ఓ విజిటింగ్ కార్డ్ తీసి నా కిచ్చాడు. 'శేఖరం - లాయరు పేట, ఒంగోలు," అని ఉంది.

"మీరు....?"

"అవునయ్యా, నేనే శేఖరాన్ని. ఆ "పల్లెపిల్ల" నవల వ్రాశాను. నీకు నా నవల బాగా నచ్చిందన్నావు కదా ? ఎక్కడ నచ్చిందో, ఎలా నచ్చిందో వివరంగా ఓ లెటర్ వ్రాయి నా అడ్రసుకు -"

బెడ్డింగు తలుపు దగ్గరకు జరుపుకోబోతున్నాడు.

"అయితే మీ నవారు ఆట... ఈ ప్లాట్ఫారంమీద...,"

"నే ననలెన్నడూ నవారు ఆట ఆడందే! నేనీ ఊళ్ళో గౌరవంగా ఓ ఉద్యోగం చేసుకొని బతుకుతున్నాను. నేనెప్పుడూ మామిడికాయ దొక్క కాలేదు. ఏ కారుకిందా పడలేదు. ఇందాకా నీకు చెప్పినదంతా నేను వ్రాయబో తున్న మరో నవల ప్లాను. నీ రసావేశంచూచి తప్పకుండా ఇందులో సస్పెన్సూ వ్యవహారమూ ఉందని ఇప్పుడు నిశ్చయించుకున్నాను. కాబట్టి తప్పక వ్రాసి అచ్చు కాగానే తొలి శ్రోతవు కాబట్టి తప్పక నీకో కాపీ పంపుతాను, రామ్మూర్తీ."

ఒంగోలు ప్లాట్‌ఫారమ్‌మీద శేఖరం కథ ఏమైందో వినాలని నేనిప్పటి దాకా ఎదురుచూశానో, ఆ ప్లాట్‌ఫారమ్ మీదనే శేఖరం దిగి చక్కా వెళ్ళి పోయాడు.